క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి


ముత్తంశెట్టికి ప్రసాదం అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో పూజలు నిర్వహించి గోదాదేవి సన్నిధిలో వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

34 మందికి కొలువులు


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

గోపాలపట్నం: నరవ బెహరా విద్యాసంస్థల్లో పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న 34 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యారు. ఇటీవల దువ్వాడలోని విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో హోబెల్ బెల్లోస్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 34 మంది విద్యార్థులను ఆ సంస్థ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ అధికారి గోవిదరాజు, కంపెనీ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్లు మురుగన్, రుద్రేష్, కిషోర్, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

వాల్మీకి మహర్షికి ఘన నివాళి


వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయురాలు నాగేశ్వరి తదితరులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నాగేశ్వరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యంలో చేసిన రచనలకు గానూ ఆయన్ను సంస్కృత భాషకు ఆదికవిగా పిలుస్తారన్నారు.శ్లోకమనే ప్రక్రియను కనుగొన్నారని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.శిరీష, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో శివాజీ ప్రతిభ

పెదగంట్యాడ: కెనడాలోని కాల్గరీలో ఈ నెల 16 నుంచి 22 వరకు నిర్వహించిన వరల్డ్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే యూనియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని సమతానగర్‌కు చెందిన శివాజీ సత్తా చాటాడు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు క్రీడాకారులు వివిధ విభాగాలకు ఎంపికయ్యారు. అందులో వెటరన్ విభాగంలో జి.శివాజీ సిల్వర్ మెడల్ సాధించారు. టీమ్ ఇండియా కోచ్, మేనేజర్ అయిన శివాజీని గ్రాండ్ మాస్టర్ శ్రీనివాసన్ అభినందించారు.

ఏఎస్ఐపై దాడి చేసిన పది మందిపై కేసు

సీతమ్మధార: పోర్ట్‌టౌన్ ఏఎస్ఐపై దాడికి పాల్పడిన పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. పోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణానగర్ తొండం వినాయకుడి గుడి వద్ద దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి విగ్రహం అనుపు కార్యక్రమంలో భాగంగా డీజే సౌండ్స్ ఎక్కువగా రావడంతో స్థానికులు డయల్ 112కు కాల్ చేశారు. నైట్ రౌండ్స్‌లో ఉన్న పోర్ట్‌టౌన్ ఏఎస్ఐ శివకృష్ణ అక్కడికి వెళ్లి నిర్వాహకులకు సౌండ్ తగ్గించాలని చెప్పారు. వారిలో మద్యం తాగిన మత్తులో ఉన్న కొంత మంది ఏఎస్ఐ విధులకు ఆటంకం కలిగించారు. వెంకటసూర్య నారాయణతో కలిసి పది మంది ఆయనపై దాడి చేశారు. స్టేషన్ అధికారి విజయకుమార్‌కు కాల్ చేసి విషయం చెప్పడంతో.. ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో కొంత మంది యువకులు పారిపోయారు. రంగంలోకి దిగిన పోలీసులు పది మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097
సాక్షి

ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష


పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి సత్తిబాబు, మురళి


వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు.

పురుషోత్తపురం 499 సచివాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల చెంతకే నాణ్యమైన వైద్యం అందించాలన్న సంకల్పంతో వైద్య శిబిరాలను క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దేవిశ్రీ, నాయకులు అంగటి సూరిబాబు, దేముడుబాబు, గంట్ల నరసింహమూర్తి, సంతోష్, జొన్నాడ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

225 మందికి వైద్య పరీక్షలు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు 409 సచివాలయం పరిధిలో సింహాచలం ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు 225 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, 93వ వార్డు నాయకులు బండి సత్తిబాబు, శ్రీకాంత్, వర్ష తదితరులు పాల్గొన్నారు.

కనకరాజు లేనిలోటు పూడ్చలేనిది

సంస్మరణ సభలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


కనకరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు, కుటుంబ సభ్యులు

పెందుర్తి: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, దివంగత నక్కా కనకరాజు లేనిలోటు పూడ్చలేనిదని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా అత్యంత సన్నిహితుడ్ని కోల్పోయానన్నారు. పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలోని కనకరాజు నివాసంలో సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. కనకరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ స్థాపించిన నాటి నుంచి కనకరాజు మండలంలో ఎంతో కీలకంగా వ్యవహరించారని చెప్పారు. పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్ మాట్లాడుతూ దాదాపు 25 ఏళ్ల రాజకీయ జీవితంతో కనకరాజు ఎలాంటి మచ్చ లేకుండా ప్రజల కోసం, నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేశారన్నారు. తొలుత ఎమ్మెల్యే అదీప్‌రాజ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కనకరాజు చిత్రపటానికి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంపీపీ మదుపాడ నాగమణి అంజి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి కనకరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, బండారు సత్యనారాయణమూర్తి, పీలా గోవిందసత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు.

నృసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

మంగమ్మకు పంచామృతాభిషేకం


మంగమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: పౌర్ణమి పురస్కరించుని చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో వెలసిన అలివేలు మంగమ్మకు పంచామృతాభిషేకాలు చేశారు. లక్ష్మీ సహస్ర, విష్ణు సహస్రనామ పారాయణాలు జరిగాయి. అమ్మవారికి నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విధులపై వివాదం


కార్మికులతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, జీవీఎంసీ జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు మధ్య శనివారం విధులకు సంబంధించిన అంశంపై వివాదం నెలకొంది. వివరాలివి..జోన్ పరిధిలోని సింహాచలంలో కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు(ఔట్ సోర్సింగ్) తమ సమస్యలపై శనివారం ఉదయం 7 గంటలకు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన జెడ్సీ నాయుడు విధులకు హాజరు కాకుండా ఇక్కడేం చేస్తున్నారని ప్రశ్నించారు. దానికి స్పందించిన కార్మికులు తాము యూనియన్ సమావేశం పెట్టుకున్నామని..తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు ఉదయం 10 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళతామని చెప్పారు. కార్మికుల సమాధానంపై జెడ్సీ స్పందిస్తూ కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు తాను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నానని చెప్పారు. పైగా ఇలాంటి సమావేశాలు ఉంటే ముందుగా తనకు నోటీసు ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి కాసేపు వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఎవరికి వారే వెను తిరగడంతో వివాదం సద్దుమణిగింది.

ముగిసిన దసరా బ్రహ్మోత్సవాలు


లలితా మహా త్రిపుర సుందరిగా రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో దసరా బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజున సహస్రాక్షి అమ్మవారు పంచప్రేతాసనాసీనా లలితా మహా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.అదేవిధంగా ఉదయం అమ్మవారి సన్నిధిలో లలితా సహస్ర నామావళి హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం రోజున ప్రతిష్టించిన కళశాల్లోని జలాలతో 9వ అంతస్తులోని బిందు స్థానంలోని సహస్రాక్షి అమ్మవారికి కలశాభిషేకం గావించి ఆహుతులైన భక్తుల సమక్షంలో పంచామృతాభిషేకం జరిపించారు. దివ్య మంగళహారతి అనంతరం నూతన వస్త్రాలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా శ్రీమేరులోని మహా కామేశ్వరునికి,మహా కామేశ్వరీ దేవికి వేద మంత్రాల నడుమ కనుల పండువగా కల్యాణం నిర్వహించారు.సాయంత్రం విశాఖపట్నంకు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ బృందంతో సంగీత గానామృత సభ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 15 రోజులు సేవలందించిన వలంటీర్స్‌ను గురుమాత అన్నపూర్ణమ్మ అభినందించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుప్రభాతసేవ చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం'


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అన్నింటినీ ఎదుర్కొంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 989వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎందరో కార్మికుల బలిదానాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఈ- హుండీ పునరుద్ధరణ


ఫోన్‌తో స్కాన్ చేసి నగదు చెల్లిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈ హుండీని శనివారం నుంచి పునరుద్ధరించారు. సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థం గోగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా హుండీ కానుక చెల్లించే విధానం గతంలో ఉండేది. కొన్ని కారణాల దృష్ట్యా దాన్ని నిలిపివేశారు. తాజాగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఈ హుండీ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ఆలయ రాజగోపురం వద్ద స్కానర్ ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని స్కానర్లు ఏర్పాటు చేస్తామని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

నేడు మాధవధార కొండపై ట్రెకింగ్

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ సంఘం ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం, ప్రకృతి అందాల వీక్షణం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ట్రెకింగ్ నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ససపల భానుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మాధవధార మాధవ స్వామి ఆలయం గుడి మెట్ల దగ్గర ట్రెకింగ్ ప్రారంభమై సింహాచలం శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి గుడి వద్ద ముగుస్తుందన్నారు. మానవ సేవే మాధవ సేవ సభ్యుల తోపాటు స్థానికులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులతో ట్రెకింగ్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. ఈ మార్గంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహిస్తామని, కొండపై పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు విత్తనాలు చల్లుతామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 76598 04633, 92966 01500 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అనధికార పార్కింగ్‌తో అవస్థలు


ఊటగెడ్డ వద్ద ట్రాఫిక్ కష్టాలు

పరవాడ: మండలంలోని పలు ప్రధాన కూడళ్లను లారీ యాజమాన్యాలు అనధికార పార్కింగ్‌కు ఉపయోగిస్తుండడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. ఎన్టీపీసీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు మెటీరియల్‌తో రాకపోకలు సాగించే భారీ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాంకీ, మండల కాంప్లెక్స్, ఊటగెడ్డ కూడలి, ఎన్టీపీసీ కూడళ్లలో లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలు నిలిపేసుత్నారు. ఈ కూడళ్లలో భోజన హోటళ్లు, టీ, టిఫిన్ వంటి ఫలహారాలు లభ్యం కావడంతో వాటి కోసం లారీ సిబ్బంది తమ వాహనాలను రోడ్ల పక్కన నిలిపివేసి హోటళ్లలో గంటల కొద్దీ కాలక్షేపం చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాత్రి వేళల్లో కూడ ఇష్టానుసారంగా రోడ్ల పక్కన నిలపడం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా వాహనాల సిబ్బందిపై ట్రాఫిక్ పోలీసులు కనీస చర్యలు చేపట్టడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన కూడళ్లలో భారీ వాహనాలను నిలిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాయి దివ్య జ్యోతితో విశ్వకాంతులు


ఆధ్యాత్మిక పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు

- శ్రీ సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధి రత్నాకర్
- రాష్ట్రస్థాయి యువజన సదస్సు ప్రారంభం

పెదగంట్యాడ: భగవాన్ సత్య సాయిబాబా వెలిగించిన దివ్వెలు విశ్వకాంతులు వెదజల్లుతున్నాయని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి ఆర్‌జే రత్నాకర్ అన్నారు. సాయిబాబా ఒక సత్సంకల్పంతో బలమైన పునాది వేశారని, దీని ఆధారంగా లక్షలాది మంది మానవతా విలువలతో విశ్వవ్యాప్తంగా అనేక దేశాలలో నిస్వార్థంగా సేవలందిస్తున్నారని చెప్పారు. జీవీఎంసీ 77వ వార్డు ఏపీ మెడ్‌టెక్ జోన్‌లోని ఆంపియర్ హాల్లో రాష్ట్ర యువజన సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, పేదలు, అణగారిన వర్గాలకు సేవలందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సత్యసాయి సేవా సంస్థలో యువత పెద్ద సంఖ్యలో చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ముందుగా ప్రశాంతి పతాకను సత్యసాయి సేవా సంస్థల ఆలిండియా అధ్యక్షుడు నిమిష్ పాండ్య, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, వీ స్టీల్ మహిళా సేవా సమితి ప్రెసిడెంట్ నుపుర్ భట్, ఏపీ మెడ్‌టెక్ జోన్ ఎండీ, ఫౌండర్ సీఈవో జితేంద్ర శర్మ, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌జీ చలం, ఆర్.లక్ష్మణరావు ఎగరవేశారు. అనంతరం శ్రీవాణి ఆధ్యాత్మిక పత్రికను ఆవిష్కరించారు. ఆపై అతిథులను ఘనంగా సత్కరించారు. ఏపీలోని మొత్తం 26 జిల్లాల్లో 1200 మంది యువతీయువకులు ఈ సదస్సుకు హాజరయ్యారు. కార్యక్రమంలో స్నేహలత సాయి, జాతీయ సేవా కో-ఆర్డినేటర్లు, రాష్ట్ర కో-ఆర్డినేటర్లు, సత్యసాయి సేవా సంస్థల జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ రిలే నిరాహార దీక్షలు

ఉక్కునగరం: ఆర్టీసీ స్టీల్ సిటీ డిపోలో ఎన్ఎంయూ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. జోనల్ కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో డిపో స్పేర్ నుంచి లిస్ట్ అయిన వారికి అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, ఉద్యోగులకు లీవు సౌకర్యం మెరుగు పరిచి నెలకు మూడు సెలవులు ఇవ్వాలనే పలు డిమాండ్లపై దీక్ష చేపట్టారు. దీక్షలో ఐ.వి.రాణి, ఎస్.వి.రాజు, పి.కె.రావు, కె.పి.నాయుడు, డి.మాణిక్యం, ఎస్.వి.వి.ఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న గొయ్యి


ప్రయాణికులను భయపెడుతున్న మలుపు వద్ద గొయ్యి

పరవాడ: జాజులవానిపాలెం-కలపాక రహదారిలో మరిశవానిపాలెం సమీపంలో రోడ్డు మధ్య ఏర్పడిన గొయ్యి ప్రయాణికులను భయపెడుతోంది. మరిశవానిపాలెం చెరువు వద్ద కల్వర్టు శిథిలమైన భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. ముఖ్యంగా హిందూజా, ఎన్టీపీసీ, ఉప్పు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తున్నారు. మలుపు వద్ద గొయ్యి ఉండడంతో చీకట్లో గొయ్యి కనిపించకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. మరమ్మతులు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలకు కారణమవుతున్న గొయ్యి పూడ్చడానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జీవీఎంసీ సీసీపీ సురేష్‌కు అభినందనలు


సురేష్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన బి. సురేష్‌కుమార్‌కు టౌన్‌ప్లానింగ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరావు, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం అభినందనలు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల సహాయ సహకారాలు సురేష్‌కు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. జీవీఎంసీ నగరాభివృద్ధిలో సురేష్ కృషి ఎనలేనిదన్నారు. జి-20, ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మాస్టర్‌ప్లాన్ రూపకల్పన, బీపీఎస్‌తో పాటు అనేక రోడ్ల విస్తరణ కార్యక్రమాలు సురేష్ సారథ్యంలో నిర్వహించామని తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు రమణ, వెంకట్రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

5న బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మహాసభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రథమ మహాసభను నవంబర్ 5వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నట్లు బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జి.వి.రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లోని బీసీఈఎఫ్ కార్యాలయంలో కార్యక్రమం పోస్టర్‌ను ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కె.వి.ఆర్.మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.చిన్నారావు, నాయకులు బి.నాగేశ్వరరావు, గొలగాని సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com